JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 02-09-2025
Medchal - Malkajgiri । Tuesday 02-09-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 98 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 98 । Pages : 8 । ₹: 5

## నర్గీస్ భర్త బ్యాక్ గ్రౌండ్ ఇదే..

2011లో 'రాక్‌స్టార్'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది నర్గీస్. మద్రాస్ కేఫ్, డిష్యుం, హౌజ్‌ఫుల్–3 తదితర సూపర్ హిట్ సినిమాల్లోనూ నటించింది. హాలీవుడ్ సినిమా 'స్పై'లోనూ యాక్ట్ చేసింది. అయితే ఈ అమ్మడు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇండియన్-అమెరికన్ ఎంట్రప్రెన్యూర్ టోనీ బెగ్ ను రహస్యంగా పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతను అమెరికాలోని 'డియోజ్ గ్రూప్ ' అనే భారీ కంపెనీకి ఛైర్మన్‌గా ఉంటున్నాడు. ఈ కంపెనీ టర్నోవర్ ఏకంగా రూ. 5,999 కోట్లు. అలానిక్ (స్పోర్ట్స్ వేర్), 8హెల్త్ (మెడికల్ ప్రొడక్ట్స్ ), ఒయాసిస్ అపెరల్ వంటి ఫేమస్ బ్రాండ్లన్నీ ఈ కంపెనీ ఆధీనంలోనే ఉన్నాయి. లాస్ ఏంజెలెస్‌లో నివాసముండే టోనీకి గ్లోబల్ బిజినెస్ వరల్డ్‌లో పవర్ ఫుల్ పర్సనాలిటీగా మంచి గుర్తింపు ఉంది.



# పంట నష్టం అంచనా వేసి నివేదిక ఇవ్వాలి



2 లో

- ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.
- రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు (SDRF) నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.





# బీఆర్ఎస్ నిరసనలు

- కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలనుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని, తెలంగాణ జీవనాడి అయిన ఈ ప్రాజెక్టును శాశ్వతంగా మూసివేసి గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు.

**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు ఆందోళనలు చేపట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ నేతలతో సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడం అంటే, దానిని పూర్తిగా మూసివేయడమేనని అన్నారు. "ఇది కేవలం కేసీఆర్‌పై జరుగుతున్న దాడి కాదు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసి, కాళేశ్వరాన్ని ఎండబెట్టి,

...మిగతాది 2 లో

## కాళేశ్వరంపై హైకోర్టులో విచారణ

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 1:**

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సీబీఐ దర్యాప్తు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత నిర్ణయం ప్రకటించింది. కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై కేసీఆర్, హరీష్ రావు హైకోర్టును ఆశ్రయించారు. దీన్ని అత్యవసర పిటిషన్‌గా స్వీకరించి విచారణ చేపట్టాలని హరీష్‌రావు లాయర్ కోర్టును కోరారు. తమపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా

...మిగతాది 2 లో

# మోడీ పుతిన్ సమావేశం

- మేము భారత్ తోనే ఉన్నాం అంటూ అమెరికా విదేశాంగ మంత్రి సంచలన ప్రకటన



**జయభేరి, బీజింగ్, సెప్టెంబర్ 1:**

అమెరికా రష్యా నుంచి ఆయిల్ దిగుమతి అనే సాకు చూపించి భారతదేశంపై 50 శాతం సుంకం విధించింది. అమెరికాతో సంబంధాలు క్షీణించాయి. ఈ చర్యలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత పెరిగింది. సంబంధాలను దెబ్బతీసింది. భారతదేశం రష్యాతో చమురు వ్యాపారం చేస్తోందని చెబుతూ అమెరికా అదనంగా 25 శాతం సుంకం విధించింది. భారత్ చమురు దిగుమతిని చేసుకోకుండా ఆపాలని అమెరికా కోరుకుంది. తర్వాత భారత్ పై మరింత ఒత్తిడిని సృష్టించడానికి అదనపు సుంకం విధించింది. ఆగష్టు 27 నుంచి ఈ అదనపు సుంకాలు అమల్లోకి వచ్చాయి. అయితే ఇప్పుడు ప్రధానమంత్రి మోడీ SCO శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి చైనాలో అడుగుపెట్టారు. జి జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ ఇద్దరినీ మోడీ కలిశారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చేసిన ఒక

...మిగతాది 2 లో

# ఇప్పటికే అణుబాంబు పేల్చాం

- త్వరలో హైడ్రోజన్ బాంబు పేలుస్తాం
- రాహుల్‌గాంధీ



2 లో

# హరీష్, సంతోష్ వల్లే కేసీఆర్ పై మరకలు



**జయభేరి, హైదరాబాద్ :**

కేసీఆర్ కుమార్తె కవిత మరోసారి బీఆర్ఎస్ పార్టీలో అణుబాంబు వేశారు. కేసీఆర్ పై సీబీఐ విచారణకు ఆదేశించిన అంశంలో కడుపు రగిలి పోతోందని మీడియా ముందుకు వచ్చిన ఆమె, కేసీఆర్ పై మరకలు పడటానికి హరీష్ రావు, సంతోష్‌రావే కారణం అని నేరుగా ఆరోపణలు చేశారు. వారిద్దదరూ తీవ్రమైన అవినీతికి పాల్పడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ కు డబ్బు యావ లేదని..కానీ హరీష్ , సంతోష్ లు మాత్రం భారీగా అవినీతికి పాల్పడ్డారన్నారు. అందుకే హరీష్ రావును గతంలో కేసీఆర్ నీటి పారుదల మంత్రిగా తొలగించారని కూడా కవిత గుర్తు చేసుకున్నారు. తన తండ్రి పై సీబీఐ కేసు నమోదు చేస్తే..కేసీఆర్ పరువుపోతే తనకు ఆవేదన ఉండదా అని కవిత కంటతడి పెట్టుకున్నారు. హరీష్ రావు, సంతోష్ రావు వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. తాను ఇలా మాట్లాడుతూంటే తన వెనుక ఎవరో ఉన్నారని ఆరోపిస్తారని నిజానికి వారే రేవంత్ రెడ్డితో కలిసి తన తండ్రిపై కుట్ర చేస్తున్నారన్నట్లుగా మాట్లాడారు. కవిత అమెరికా నుంచి వచ్చిన తర్వాత తెలంగాణ జాగృతి సభ్యులతో సమావేశం అయ్యారు. హరీష్ రావు, సంతోష్ రావు వ్యక్తిగత స్వార్థం కోసమే అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇద్దరు అధికారులు వందల కోట్లతో పట్టుబడ్డారని వారి వెనుక ఎవరున్నారో తేల్చాలన్నారు. అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువు అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పై సీబీఐ కేసులు పెట్టే అంత పరిస్థితి వచ్చాక..పార్టీ ఉంటే ఎంత పోతే ఎంత, అని ప్రశ్నించారు. ఈ కేసులో కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో కవిత వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీలో పెను సంచలనానికి కారణం అయ్యే అవకాశాలు ఉన్నాయి.



# కూటమికి కేజ్రీవాల్ షాక్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:**

బీహార్ రాష్ట్రానికి జరిగే శాసనసభ ఎన్నికలు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ ఎన్నికలు అన్ని రాజకీయ పార్టీలకు అత్యంత ముఖ్యంగా మారిపోయాయి. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఏకంగా బీహార్ లో తిష్ట వేశారు. ఆయన అక్కడ తన సోదరి ప్రియాంక గాంధీ తో కలిసి ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై ఓటు దొంగ అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులను బీహార్ కు పిలిపించుకొని.. రాహుల్ ఎన్నికల ప్రచారం చేపడుతున్నారు.. ఇది ఎంతవరకు విజయవంతం అవుతుందో తెలియదు గానీ.. జాతీయ మీడియాలో మాత్రం రాహుల్ చేస్తున్న యాత్ర విస్తృతమైన ప్రచారంలో ఉంటున్నది. బీహార్ ఎన్నికల్లో సానుకూల ఫలితాలు సాధించాలని రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్న క్రమంలో..

...మిగతాది 2 లో

# చంద్రబాబు, పవన్, కేసీఆర్, జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నా

- తెలుగువారికి అవకాశం వచ్చింది..
- ఉప రాష్ట్రపతి బరిలో నిలిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి
- రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలు పక్కన పెట్టాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



2 లో

# పేదలకు ఇచ్చే పెన్షన్ దానం కాదు.. ప్రభుత్వ బాధ్యత

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన

**జయభేరి, రాయచోటి, సెప్టెంబర్ 01:**

పేదలకు, వృద్ధులకు, వికలాంగులకు నెల నెల ప్రభుత్వం అందించే పెన్షన్ దానము కాదని అది బాధ్యతని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. సోమవారం అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గంలో బోయన పల్లెలో పేదల సేవలో ప్రభుత్వం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. వితంతువులకు తెలుగు వారికి పెన్షన్లను పరిచయం చేసింది ఎన్టీఆర్.రూ. 30తో 1983లో ఎన్టీఆర్ పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు రూ. 4000, దివ్యాంగులకు రూ. 6 వేలు, 10 వేలు, 15 వేలు ఇస్తున్నాం. దివ్యాంగులకు 12 రెట్లు పెన్షన్ పెంచింది. టీడీపీనే. దివ్యాంగులు కాని వారికి. వైసీపీ కార్యకర్తలకు గత ప్రభుత్వం పెన్షన్లు ఇచ్చింది. అర్హులకు పెన్షన్ ఇవ్వాలి. ప్రభుత్వ సంపద పేదలకే పంచి పెట్టాలి. చెడును చెడుగా మంచిని మంచిగా చెప్పడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. 30 ఏళ్లల్లో ఒక్కనాడైనా విరామం తీసుకున్నానా.



2 లో

# ఇండియా, చైనా సంబంధాలు కొత్త దారి..?

▶▶ మొదటిపేజీ తరువాయి

## బీఆర్ఎస్ నిరసనలు

మన నీటిని పక్క రాష్ట్రాలకు తరలించే పెద్ద కుట్ర" అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఈ కపట నాటకం ఆడుతున్నాయని, ఈ రెండు పార్టీల కుట్రలను సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.నిన్నటి వరకు సీబీఐని వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి, ఒక్కరోజులోనే మాట మార్చడం వెనుక ఉన్న శక్తులు ఏంటో ప్రజలకు తెలియాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తెలంగాణ ప్రయోజనాలకు గండి కొడుతోందని ధ్వజమెత్తారు. తమకు కేసులు, విచారణలు కొత్త కాదని, ఏ ఏజెన్సీతో విచారణ జరిపించినా భయపడేది లేదని ఆయన తేల్చిచెప్పారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని, ఈ కుట్రలను ప్రజల ముందు ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణకు సిద్ధమవడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని, ఆయన గతంలో చేసిన వ్యాఖ్యలనే ఆయనకు గుర్తుచేస్తూ విమర్శలు గుప్పించారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ఈ అంశంపై స్పందించారు. "మిస్టర్ రాహుల్ గాంధీ, తెలంగాణలో మీ కరెన్సీ మేనేజర్ (సీఎం) కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించాలని నిర్ణయించారు. మీ సీఎం ఏం చేస్తున్నారో మీకు తెలుసా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. గతంలో సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని, అవి ప్రతిపక్షాలను నాశనం చేసే సెల్‌గా మారిపోయాయని రాహుల్ విమర్శించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఆనాటి రాహుల్ ట్వీట్ స్క్రీన్‌షాట్‌ను కూడా తన పోస్టుకు జతచేశారు.ఒకప్పుడు బీజేపీ చేతిలో కీలుబొమ్మలని విమర్శించిన దర్యాప్తు సంస్థలకే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం విచారణను ఎలా అప్పగిస్తుందని కేటీఆర్ పరోక్షంగా నిలదీశారు. తమపై ఎన్ని కుట్రలు పన్నినా వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. "మేం రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతాం. మాకు న్యాయవ్యవస్థపైనా, ప్రజలపైనా పూర్తి నమ్మకం ఉంది. సత్యమేవ జయతే" అంటూ తన ట్వీట్‌ను ముగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

## కాళేశ్వరంపై హైకోర్టులో విచారణ

మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కానీ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. సీబీఐ విచారణ జరిపించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని హరీష్ రావు లాయర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇంతకుముందు అసెంబ్లీలో చర్చించిన తరువాత చర్యలు తీసుకుంటామని అడ్వకేట్ జనరల్ హైకోర్టుకు తెలిపారని హరీష్ రావు లాయర్ గుర్తుచేశారు. కోర్టు ఈ పిటిషన్ విచారణ మంగళవారానికి వాయిదా వేసింది. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి 2 గంటలు దాటిన తరువాత సైతం కాళేశ్వరం కమిషన్ నివేదికపై తెలంగాణ శాసనసభలో కీలక చర్చ జరిగింది. గత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,500 కోట్లతో బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 16 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు హైదరాబాద్ కు తాగునీరు అందించాలని భావించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత ఉన్నప్పటికీ ఇంజినీర్లు చెప్పినట్లు కాకుండా కేసీఆర్, హరీష్ రావు డిజైన్లు మార్చి రీడిజైన్ పేరుతో వేల కోట్లు కొల్లగొట్టారు అని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద ఒక్క లిఫ్ట్ ఏర్పాటు చేసి ఎత్తిపోయాల్సిన నీళ్లకు బదులుగా.. మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టి దానికి అనుబంధంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించి ప్రాజెక్టుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 87 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. అయితే 202223 నాటికి ప్రాజెక్టు పూర్తికి ఖర్చు అంచనా రూ.1.27 లక్షల కోట్లు కాగా, భవిష్యత్తులో దీనిని పూర్తి చేయడానికి రూ.1.47 లక్షల కోట్లు అవుతుందని ఇదే ప్రాజెక్టు పూర్తి ఖర్చు అని సీఎం రేవంత్ రెడ్డి సభలో తెలిపారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలని ఫిక్సయిన తరువాత సంస్థలను డిజైన్, నీటి లభ్యత అడిగారని చెప్పారు. దాంతో అందుకు అనుగుణంగా వాళ్లు డిజైన్, ప్లాన్ చేసి ఇచ్చారు కానీ, తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ వద్దని మాత్రం ఎక్కడా చెప్పలేదన్నారు. కాంగ్రెస్ గత ప్రభుత్వం అన్ని అనుమతులు తీసుకున్నాక, బీఆర్ఎస్ పాలకులు తెలివిగా అనుమతుల కోసం మళ్లీ లేఖ రాశారని గుర్తు చేశారు. 162 టీఎంసీలు నీళ్లు ఎత్తిపోశారు. ఏడాదికి కేవలం 20, 30 టీఎంసీలే లిఫ్ట్ చేయగా.. రైతులకు సైతం సాగునీరు అందించలేదని తెలంగాణ ప్రభుత్వం ఆరోపించింది. లక్ష కోట్ల ప్రజా ధనం వృథా చేసిన బీఆర్ఎస్ పాలకులు, సంబంధిత అధికారులు, ఇంజినీర్లపై చర్యలు చేపట్టడంలో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తును సీబీకి అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

## మోడీ పుతిన్ సమావేశం

పెద్ద ప్రకటన వెలుగులోకి వచ్చింది.భారతదేశంలోని అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ Xలో విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చేసిన ప్రకటనను పంచుకుందిషాంఘై సహకార సదస్సు (ఎస్‌సీవో) వేదికగా ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల ద్వైపాక్షిక సమావేశానికి కొద్ది నిమిషాల ముందు, భారత్ పట్ల అమెరికా తన వైఖరిని మార్చుకుంది. ఇప్పటివరకు భారత్‌పై విమర్శలు గుప్పించిన ట్రంప్ యంత్రాంగం నుంచి అనూహ్యంగా ప్రశంసలు వెల్లువెత్తడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వ్యాపారం, రక్షణ, సృజనాత్మకత వంటి అనేక రంగాల్లో సహకారం అద్భుతంగా ముందుకు సాగుతోందని ఆయన కొనియాడారు. "21వ శతాబ్దంలో భారత్‌అమెరికా సంబంధాలు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయి. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న స్నేహమే మా బంధానికి పునాది" అని రూబియో తన పోస్టులో వివరించారు.అయితే, రూబియో ఈ ప్రశంసలు గుప్పించడానికి కొన్ని గంటల ముందే ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో నుంచి భారత్‌పై తీవ్రమైన ఆరోపణలు రావడం గమనార్హం. ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ కారణమంటూ ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం నుంచి భిన్న స్వరాలు వినిపించడం గందరగోళానికి తావిచ్చింది.మరోవైపు, ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు చట్టవిరుద్ధమంటూ అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తాజాగా తీర్పు ఇవ్వడం కూడా ట్రంప్ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో, నష్ట నివారణ చర్యల్లో భాగంగానే రూబియో ఈ ప్రకటన చేసి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎస్‌సీవో వేదికపై భారత్, రష్యా, చైనా వంటి దేశాలు ఒకే చోట చేరడం కూడా అమెరికా వ్యూహాత్మక మార్పునకు కారణమై ఉండొచ్చని వారు భావిస్తున్నారు.

## ఇప్పటికే అణుబాంబు పేల్చాం

ఓట్ల చోరీకి సంబంధించి తాము ఇప్పటికే అణుబాంబు పేల్చామని, త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారని చెప్పారు. 'ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా పట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.'రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. అందుకు మేం అనుమతించబోం. బీజేపీని అడ్డుకునేందుకే ఈ యాత్ర నిర్వహించాం. దీనికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మహారాష్ట్రలో, కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగిందని ఆధారాలతో సహా చూపించాం. ఓట్ల చోరీ అంటే.. హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అన్నట్లే. ఈ వ్యవహారంలో త్వరలోనే హైడ్రోజన్ బాంబు పేలుస్తాం' అని రాహుల్ గాంధీ అన్నారు. అయితే 'ఓటరు అధికార్ యాత్ర' ముగింపు సందర్భంగా ఇండియా కూటమి నేతలు పట్నాలో నిర్వహించిన 'గాంధీ సే అంబేద్కర్' మార్చ్‌ను పోలీసులు మార్గమధ్యలో అడ్డుకున్నారు. దాంతో నేతలు అక్కడే ప్రసంగించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఓడిపోతుందని జోస్యం చెప్పారు.బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో రాహుల్ గాంధీ 'ఓటరు అధికార్ యాత్ర' చేపట్టారు. ఆగస్టు 17న ససారాంలో మొదలైన ఈ యాత్ర 25 జిల్లాల్లోని 110 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,300 కిలోమీటర్ల మేర కొనసాగింది. బీహార్‌లో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియ మొదలుకొని మహిళా సమస్యలు, రైతు సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలను లేవనెత్తుతూ రాహుల్‌గాంధీ స్థానికులకు చేరువయ్యే ప్రయత్నం చేశారు.

# ఇండియా, చైనా సంబంధాలు కొత్త దారి..?

**భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల భారం అమల్లోకి వచ్చిన కొన్ని గంటల తర్వాత భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాలో అడుగు పెట్టారు. ప్రస్తుతం భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వజ్రాలు, రొయ్యలు వంటి వాటిపై 50శాతం సుంకం చెల్లించాల్సి ఉంది.**



రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు భారత్‌కు ఈ శిక్ష విధించినట్లు ట్రంప్ చెబుతున్నారు.భారత ఎగుమతుల లక్ష్యాలపై ట్రంప్ సుంకాలు బలమైన శాశ్వత గాయాలను మిగిల్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాల నాయకులు తమ మధ్య వాణిజ్య సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నారు.అయితే గతంలో ఈ రెండు దేశాల మధ్య సంబంధాల్లో అపనమ్మకం, సరిహద్దు వివాదాలు కీలకంగా ఉన్నాయి.సింపుల్‌గా చెప్పాలంటే, ఈ రెండు దేశాల సంబంధాల్లో ఏం జరుగుతుందనేది ప్రపంచ దేశాలకు ఆసక్తికరంగా మారింది.అమెరికా, పశ్చిమ దేశాలు భావిస్తున్నట్లు చైనాకు వ్యతిరేకంగా భారత్ ఎన్నటికీ ఒక రక్షణ కవచంగా ఉండదు. మోదీ పర్యటన కీలక మలుపును సూచిస్తుంది" అని ఆయన ఆ వ్యాసంలో పేర్కొన్నారు.భారత్, చైనా ప్రపంచ ఆర్థిక శక్తులు. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో చైనా రెండో స్థానంలో, భారత్ ఐదో స్థానంలో ఉన్నాయి. అయితే భారత్ సాధిస్తున్న 6 శాతం వృద్ధి రేటు, 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 5 ట్రిలియన్ డాలర్ల స్టాక్ మార్కెట్ లాంటి అంశాలు భారత్ 2028కల్లా ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది ప్రపంచంలో అతి పెద్ద రెండు ఆర్థిక వ్యవస్థలైన అమెరికా చైనా ఎలా కలిసి పని చేస్తాయా అని చూస్తున్నప్పుడు.. రెండు, మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిసి ఎలా పని చేస్తాయా అని చూడాల్సిన సమయం వచ్చింది" అని బీజింగ్‌లోని ఉసావా అడ్వైజరీ వ్యవస్థాపకుడు కియాన్ లియు అన్నారు.అయితే ఈ రెండు దేశాల సంబంధాల్లో అనేక సవాళ్లు ఉన్నాయి.2020 జూన్‌లో గాల్వాన్ లోయలో హింసాత్మక సంఘర్షణ, రెండు దేశాల సంబంధాలను గతంలో ఎన్నడూ లేనంత క్షీణ దశకు చేర్చింది.ఇది ఆర్థిక సంబంధాల మీదనే ఎక్కువ ప్రభావం చూపింది. రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాల రాకపోకల్ని నిలిపివేయడం, వీసాలు, పెట్టుబడులు ఆపేయడంతో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం మందగించింది. టిక్‌టాక్ సహా చైనాకు చెందిన 200కి పైగా యాప్‌లను భారత్ నిషేధించింది.పశ్చిమ దేశాల ఆలోచనలకు భిన్నమైన ప్రపంచ దృష్టి కోణాన్ని ప్రదర్శిస్తోన్న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో పాల్గొనేందుకు మోదీ చైనా వెళ్లారు. ఇందులో భారత్‌తో పాటు చైనా, పాకిస్తాన్, ఇరాన్, రష్యా సభ్య దేశాలు.గతంలో భారత్ ఈ సంస్థ ప్రాధాన్యాన్ని తక్కువగా అంచనా వేసింది.ఈ సంస్థ కొన్నేళ్ల వరకు గుర్తించదగిన ఫలితాలేవీ సాధించలేదని విమర్శకులు చెబుతున్నారు.2025 జూన్‌లో జరిగిన ఎస్‌సీఓ రక్షణ మంత్రుల సమావేశంలో ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ ప్రకటనలో పహల్గాంలో తీవ్రవాదుల దాడిపై ఎటువంటి ప్రస్తావన లేకపోవడంతో భారత్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అయితే దిల్లీ, వాషింగ్టన్ మధ్య సంబంధాలు క్షీణించడంతో భారత్ మళ్లీ షాంఘై సహకార సంస్థ ప్రాధాన్యాన్ని గుర్తించేలా చేసిందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ట్రంప్ సుంకాల దాడితో ఆసియాన్ దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాల ప్రాధాన్యాన్ని చైనా గుర్తించింది.2024 అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ చివరిసారిగా జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్‌లను కలిశారు. త్వరలో చైనా, భారత్‌తో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు రష్యన్ రాయబార కార్యాలయ అధికారులు తెలిపారు.చైనా తయారీ నైపుణ్యం, భారత్ సేవా రంగ బలాలు, రష్యా సహజ వనరులనుఉపయోగించుకోవడం ద్వారా ఈ మూడు దేశాలు అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు" అని బాజపేయి తన వ్యాసంలో రాశారు.

భారత్ ఉత్పత్తి, తయారీ రంగంలో చైనా మీద ఆధారపడుతోంది. ఎందుకంటే భారత్‌లో తయారవుతున్న అనేక వస్తువుల ముడి పదార్థాలు చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఆ వస్తువుల మీద దిగుమతి సుంకాలు తక్కువగా ఉండాలని భారత్ ఆశిస్తోంది.చైనా సరఫరా వ్యవస్థలతో ఆగ్నేయాసియా దేశాలు పొందుతున్న ప్రయోజనాలను పొందడంలో భారత్ అనుసరిస్తున్న కఠిన పారిశ్రామిక విధానాలు అడ్డంకిగా మారాయని నిపుణులు చెబుతున్నారు. చైనాతో భారత్ భాగస్వామ్యం కోరుకోవడంలో బలమైన కారణం ఉందని, భారత్ మరిన్ని ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రయత్నిస్తోందని ఆసియా డీకోడెడ్ పరిశోధన సంస్థ వ్యవస్థాపకురాలు ప్రియాంక కిషోర్ అన్నారు.చైనా నుంచి వచ్చే వీసా అభ్యర్థనలను భారత్ త్వరగా ఆమోదించాలి. అప్పుడే ఇది చైనాకు సులభమైన విజయం అవుతుంది. ప్రత్యక్షంగా లేదా పెట్టుబడుల ద్వారా భారత మార్కెట్లలోకి ప్రవేశించాలని చైనా భావిస్తోంది. ఇదే జరిగితే భారత్‌లో తగ్గుతున్న అమెరికన్ పెట్టుబడుల లోటును పూడ్చుకోవచ్చు" అని ప్రియాంక కిషోర్ అభిప్రాయపడ్డారు."140 కోట్ల మందికి తమ ఉత్పత్తులను అమ్మే అవకాశాన్ని బీజింగ్ స్వాగతిస్తుంది" అని ఆమె చెప్పారు.రెండు దేశాల మధ్య సంబంధాల్లో ఉన్న సంక్లిష్టత దృష్ట్యా ఒక్క సమావేశంలోనే ఏదో అద్భుతం జరిగే అవకాశం లేదు. అలాంటి అద్భుతం కోసం ఈ రెండు దేశాలు ఇంకా చాలా దూరం ప్రయాణించాలి.

అయితే చైనాలో మోదీ పర్యటన అందుకు అవసరమైన ప్రారంభాన్ని అందిస్తుంది. అంతే కాకుండా భారత్‌కు ప్రత్యామ్నాయాలు ఉన్నాయనే సంకేతాన్ని వాషింగ్టన్‌కు పంపిస్తుంది.

## విజ్ఞప్తి చేస్తున్నా

ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతివ్వాలన్న ముఖ్యమంత్రి ఉపరాష్ట్రపతిగా తెలుగు వ్యక్తిని గెలిపించుకునే అవకాశం వచ్చిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మద్దతు ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులకు ఆయన విజ్ఞప్తి చేశారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నాను. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కన పెట్టి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి" అని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని తెలిపారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రస్తుతం ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యం ఉందని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే అజెండాతో ఎన్డీయే అభ్యర్థిని నిలబెట్టిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలోకి దింపిందని చెప్పారు. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చని, కానీ తెలుగు వ్యక్తికి అవకాశం వచ్చిందని వ్యాఖ్యానించారు.

## కూటమికి కేజ్రీవాల్ షాక్

ఆయనకు గండి కొట్టడానికి ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సిద్ధమైనట్టు కనిపిస్తోంది.అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీ మొన్నటిదాకా ఇండియా కూటమిలోనే ఉండేది. ఎప్పుడైతే ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో తేడాలు వచ్చాయో.. అప్పటినుంచి ఆప్ ఇండియా కూటమి నుంచి బయటికి వచ్చేసింది. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ కాంగ్రెస్ పార్టీని కార్నర్ చేసింది. తీవ్ర స్థాయిలో విమర్శలు చేసింది. అయితే ఇప్పుడు దీనికి కొనసాగింపుగా బీహార్ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ రాహుల్ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాటలు దేశ రాజకీయాలలో సంచలనం కలిగిస్తున్నాయి.. పరిస్థితులు చూడబోతే బిజెపి కాంగ్రెస్ మధ్య పొత్తు ఉన్నట్టుగా కనిపిస్తున్నాయి. నేషనల్ హెరాల్డ్ కేసు మూతపడిందనిపిస్తోంది. గాంధీ కుటుంబం నుంచి ఒకరు కూడా జైలుకు వెళ్లలేదు. ఫేక్ కేసులలో మేము జైలు శిక్ష అనుభవించాం. 2 జి, బొగ్గు కుంభకోణాల కథ దాదాపు ముగిసినట్టే. కాంగ్రెస్ చాలా విషయాలలో కాంప్రమైజ్ అయిపోయింది. ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. ప్రజాస్వామ్య పరిరక్షణ కేవలం వారి వ్యక్తిగత రక్షణకు మాత్రమే తోడ్పడుతోంది. ఇదంతా కూడా ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. కచ్చితంగా వారు న్యాయమైన తీర్పు ఇస్తారని" అరవింద్ వ్యాఖ్యానించారు..అరవింద్ చేసిన వ్యాఖ్యలు ఒక్కసారిగా దేశవ్యాప్తంగా చర్చకు దారితీసాయి. వాస్తవానికి ఇటీవల కాలంలో రాహుల్ బిజెపిని ఒక ఆట ఆడుకుంటున్నారు. ఇలాంటి క్రమంలో రాహుల్ గాంధీని కార్నర్ చేసి అరవింద్ విమర్శలు చేయడం.. అది కూడా కీలక విషయాలను ప్రస్తావించడంతో కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. అయితే అరవింద్ చేసిన వ్యాఖ్యలు బీహార్ ఎన్నికల్లో ఏ మేరకు ప్రభావం చూపిస్తాయో చూడాల్సి ఉంది. అన్నట్టు అరవింద్ పార్టీ బీహార్ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు.

## పేదలకు ఇచ్చే పెన్షన్

ఒక్క రోజైనా అలసిపోయినట్టు కన్పించానా. పేదల కోసం నిత్యం పని చేయాలి. సంక్షేమం అందించాలి అందరి భవిష్యత్ బాగుండాలనే నిరంతరం ఆలోచిస్తున్నా ఆదాయం పెంచుకున్నప్పుడే జీవితాల్లో మార్పు సాధ్యం. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగు వాళ్లు కనిపిస్తారు. ఉన్నతవిద్య, ఉపాధి, వ్యాపారాల కోసం విదేశాలకు వెళ్తున్నారు. రాష్ట్ర విభజన మనకు తర్వాత అనేక కష్టాలు వచ్చాయి. 201419 మధ్య దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధిని చేసి చూపించాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు మళ్లీ స్వేచ్ఛ వచ్చింది. మొన్నటి ఎన్నికల్లో ప్రజలు కూడా ఎంతో విజ్ఞత చూపించారు దేశాభివృద్ధికి ప్రధాని మోదీ అనేక సంస్కరణలు తెసున్నారు. దేశాభివృద్ధిలో మన రాష్ట్రం కీలకపాత్ర పోషించాలి గత పాలకులు అధికారాన్ని స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారు. మా పార్టీ ఎప్పుడూ ప్రజల కోసమే అధికారం ఉపయోగిస్తోంది వైసీపీ హయాంలో అనర్హులు కూడా దివ్యాంగుల పింఛను తీసుకున్నారు.నిజమైన దివ్యాంగులకు మేం న్యాయం చేస్తాం. అనర్హులు పింఛను తీసుకోకుండా ప్రజలే ఆపాలి గత పాలకులు రాయలసీమలో రక్తం పారించారు. మేం వచ్చాక రాయలసీమలో సాగునీరు పారిస్తున్నాం ఆడవాళ్లపై అఘాయిత్యాలు చేస్తే అదే మీకు చివరిరోజు కష్టాల్లో ఉన్న మామిడి రైతులను మేం ఆదుకున్నాం. మామిడికాయలు రోడ్డుపై పోసి వైసీపీ నేతలు డ్రామాలు ఆడారు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టేముందు పదిసార్లు ఆలోచించాలి మహిళల ఆత్మగౌరవం దెబ్బతిస్తే కఠిన చర్యలు తప్పవు కడప, రాజంపేట మీదుగా కోడూరుకు నీళ్లు తీసుకెళ్తాం రాజంపేటలో వ్యవసాయం తగ్గింది.. ఉద్యానపంటలు పెరిగాయి రాజంపేటలో డెయిరీ, పశుసంపద బాగా పెరిగింది గంగానది నుంచి కావేరి వరకు నదుల అనుసంధానం జరగాలి వంశధార నుంచి గోదావరి, కృష్ణా, పెన్నా నదులు అనుసంధానం చేస్తాం మీరు ఆశీర్వదిస్తే చాలు.. కొండలనైనా పిండి చేస్తాం ఒంటిమిట్టను టీటీడీ దత్తత తీసుకుంది.. అనేక కార్యక్రమాలు చేపట్టింది మా దృష్టిలో రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరు సంజీవని పేరుతో ప్రాజెక్టు తెస్తున్నాం ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని సంజీవని ప్రాజెక్టు తీసుకొస్తున్నాం వైసీపీ నేతలు మొన్నటివరకు సిద్ధం.. సిద్ధం.. అని వైసీపీ నేతలు ఎగిరిపడ్డారు.

**అసెంబ్లీకి వచ్చేందుకు, అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?**

మొన్న జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలపై చర్చకు సిద్ధం వివేకా హత్య, కోడికత్తి డ్రామా, గులకరాయి నాటకాలపై చర్చకు సిద్ధం అసెంబ్లీకి రండి.. ఏ విషయమైనా తేల్చుకుందాం సమైఖ్య రాష్ట్రంలో నేనే ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా ఉన్నాను. 30 ఏళ్ల కాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను.అయినా పేదల సంక్షేమం కోసం పని చేస్తున్నాం. పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పని చేస్తూనే ఉంటాను. రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం. సీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. ఈ 30 ఏళ్ల కాలంలో సంపద సృష్టించి.. సంక్షేమం చేయడమే నాకు కలిగిన తృప్తి. అప్పులు చేసి బాగుపడ్డ వారు లేరు.

## పంట నష్టం.. నివేదిక ఇవ్వాలి

✍ **జయభేరి, హైదరాబాద్ :**

భారీ వర్షాలు, వరదలతో తలెత్తిన పరిస్థితులు, ఆయా ప్రాంతాల్లో వాటిల్లిన నష్టాలపై డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, పశువులు కోల్పోయిన కుటుంబాలకు తక్షణమే పరిహారం విడుదల చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో వాటిల్లిన తీవ్ర నష్టానికి కేంద్రం నుంచి రావలసిన సహాయం అందకపోవడంపై ఆరా తీసిన ముఖ్యమంత్రి ఆ వివరాలతో పాటు ప్రస్తుత వరదల నష్టానికి సంబంధించిన వివరాలతో సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలోని బృందం ఈ నెల 4 వ తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి ఆ రెండు నివేదికలకు అందజేస్తుందని చెప్పారు. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడినట్టు అధికారులు చెప్పగా, ముఖ్యమంత్రి స్పందిస్తూ, చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్ఆర్ఆర్, ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవి. ఆ సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని, దానిపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించిన ప్రాథమిక అంచనాలపై స్పందిస్తూ రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. పురపాలక, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణపై సమీక్ష నిర్వహించి పరిష్కారంతో రావాలని TelanganaCS రామకృష్ణారావుకి సూచించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు కూడా రెండు రోజుల్లో సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక పనులు వేగవంతం చేయాలని, పరిహారాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అన్ని శాఖలు ఎస్డీఆర్ఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు సకాలంలో వినియోగితా పత్రాలు (యూసీ) సమర్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విపత్తు సమయాల్లో స్పందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ దళాలు వరదల సమయంలో మెరుగైన సేవలు అందించాయని అభినందనలు తెలిపారు. భారీ వర్షాల సమయంలో 42 ఆపరేషన్లలో పాల్గొని 217 మందిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సిబ్బందికి మరింత మెరుగైన శిక్షణ, నైపుణ్యాలు అందేలా చూడాలని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు స్పందన, పౌర సహాయక విభాగం డైరెక్టర్ జనరల్ కి సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, ముమ్మందు అకాల వర్షాలు, వరదలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉన్నందున జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండడంతో పాటు విపత్తుల సమయంలో తక్షణమే క్షేత్ర స్థాయికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో పనులకు కంటింజెన్సీ కింద కలెక్టర్లకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం వాటిల్లిన జిల్లా కలెక్టర్లకు రూ. 5 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

**జయభేరి, మేడ్చల్ :**

దేశ ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర నేత పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ అద్వర్యంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రధానికి ఆయా దేశ అధ్యక్షులు ప్రజలు నీరాజనం పడుతుంటే రాహుల్ గాంధీ దేశ ప్రధానిపై వారి తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇటీవల బీహార్ లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీ ఆయన తల్లిపై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత అవమనమే కాకుండా భారతీయ సంస్కృతిలో తల్లిని గౌరవించే విలువలకు అవమానకరం అన్నారు. రాహుల్ గాంధీ వాక్యాలు కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిరదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతీ, మాజీ ఎంపిటిసి ఉషిగారి శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు కవేరి శ్రీధర్, కార్యదర్శి రామారావు, ఉపాధ్యక్షుడు వసంత్ రెడ్డి, శ్రీకాంత్, మహిళ మోర్చా అధ్యక్షురాలు నవాణిత, యువమోర్చా విక్రమ్, నాయకులు సుంకు నవీన్, అరుణ్, వినోద్, శాంతన్ రెడ్డి, గణేష్, ప్రదీప్, అనుదీప్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.






## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం తానాం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా పెన్షన్లకు అర్హులైన వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు మరియు కిడ్నీ బాధితుల పెన్షన్స్ లబ్ధిదారుల యొక్క ఇంటింటికి వెళ్లి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పెన్షన్ పంపిణీ చేశారు. వీరితోపాటు పరవాడ మండలం ఎంపీడీవో రమేష్ నాయుడు, మండల రెవెన్యూ అధికారి నాగరాజు ,పంచకర్ల ప్రసాద్ రావు ,తానం గ్రామ సర్పంచ్ కన్నూరి దేవి రమణ , మాజీ జడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాధ రావు, మాజీ ఎంపీపీ సభ్యులు మాసరపు అప్పలనాయుడు , మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస కాసులు , వియ్యపు చిన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి బిగిడి రామ గోవింద్ రావు,మండల ఉపాధ్యక్షులు వర్రీ పరదేశి నాయుడు, వెన్నెల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కేఎన్ఆర్, రావాడ గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, చింతకాయల ముత్యాలు,ఏఎంసీ డైరెక్టర్ కొత్త పిల్లి అపర్ణ,బర్రెడ్డి అప్పారావు ,మహిళా నాయకులు పావని తదితరులు పరవాడ మండలం ఉమ్మడి ఎన్ డి ఏ మహా కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ యొక్క పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వసుధ ఫార్మా కంపెనీ డైరెక్టర్ ఆత్మహత్య



**జయభేరి, పరవాడ:**

విశాఖపట్నం స్టీల్ప్లాంట్ పోలీస్ స్టేషన్ సమీపంలో విషాదం నెలకొంది. పరవాడ ఫార్మా హబ్లో ఉన్న వసుధ ఫార్మా కంపెనీ డైరెక్టర్ మంతెన వెంకట సూర్య నాగవరప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నారు. పురుగుల మందు తాగి ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు నిర్ధారించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్టీల్ ప్లాంట్ ప్రగతి మైదానంలో ఒక వ్యక్తి మరణించి ఉన్నట్లు అందిన సమాచారంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడిని వసుధ ఫార్మా డైరెక్టర్గా గుర్తించారు. ఆయన మృతదేహం పక్కనే ఒక పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆయన పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై స్టీల్ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేశారు. నాగవరప్రసాద్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు లేదా మరేదైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పంచకర్ల



**జయభేరి, పరవాడ:**

పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం తానాం గ్రామంలో పరవాడ మండలానికి సంబంధించిన ముగ్గురుకు అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం చేయించుకుని ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వర్తించని వారికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 1 లక్ష 2 వేల 303 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబాలకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అందజేశారు. సీఎం సహాయనిది లబ్ధిదారుల యొక్క వివరములు చూస్తే కన్నూరు గ్రామంకి చెందిన మడక సింహాచలంకు 31,500 రూపాయలు,కలపాక పంచాయతీకి చెందిన గొర్లి నటరాజ్ కు 43,584 రూపాయలు,పెదముసిడివాడ గ్రామంకు చెందిన బర్రెడ్డి అరుణ కి 27,219 రూపాయలు చొప్పున చెక్కులు అందజేశారు.ఈ యొక్క కార్యక్రమంలో తానాం గ్రామ సర్పంచ్ కన్నురు దేవి వెంకటరమణ , పంచకర్ల ప్రసాద్ రావు,మాజీ జెడ్పిటిసి సభ్యులు పయిల జగన్నాధ రావు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కుండ్రపు



**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కార్యాలయంకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ని పరవాడ బీజేపీ నాయుకుడు కుండ్రపు సోమునాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సోమునాయుడు మండలములో ప్రస్తుత పార్టీ కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో పరవాడ మండలంలో బీజేపీ పార్టీ బలపెతం దానికి సంబందించిన ప్రణాళిక గురించి ఆయనికి వివరించారు.



## గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణం బొడ్రాయి బజార్ లో కొలువైన గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ పై అధికారులు నిర్లక్ష్యం సరికాదు

- తానం ఎంపీటీసీ రొంగలి సునీత గోపాలకృష్ణ



**జయభేరి, పరవాడ :**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమం సోమవారం తానం గ్రామంలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యిన ఈ యొక్క కార్యక్రమానికి స్థానిక ఎంపీటీసీ రొంగలి సునీత గోపాలకృష్ణకు అధికారులు సమాచారం ఇవ్వక పోవటం చాలా హీనమయినా చర్య అని ఇది అధికారులకి సరికాదని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.తానాము గ్రామ టిడిపి ఎంపీటీసీగా ఉన్న తనను ఆహ్వానించకపోవడం వల్ల ఆంతర్యం ఏమిటని ధ్వజమెత్తారు.ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోకపోతే కలెక్టర్కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా తానం ఎంపీటీసీ సభ్యులు రొంగలి సునీత గోపాలకృష్ణ హెచ్చరించారు.

## ఏసీబీ కస్టడికి ఐపీఎస్ సంజయ్

### అనుమతించిన ఏసీబీ కోర్టు

**జయభేరి, విజయవాడ :**

ఐపీఎస్ సంజయ్ను 3 రోజుల ఏసీబీ కస్టడీకి ఏసీబీ కోర్టు అనుమతించింది. సంజయ్ను మంగళవారం నుంచి 3 రోజులపాటు ఏసీబీ అధికారులు విచారించనున్నారు. ఉదయం 8 గ॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు ప్రశ్నించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. సాయంత్రం 6 గం॥లకు తిరిగి విజయవాడ జిల్లా జైలులో అప్పగించాలని కోర్టు ఆదేశించింది.

## బెల్ట్ షాపుల నియంత్రణలో విఫలం అవ్వుతున్న ఎక్సేంజ్ శాఖ

- సీఎం నారా ఆశయానికి తూట్లు
- నన్ను ఎవడ్రా ఆపేదంటున్న లంకెలపాలెం వైన్ షాప్ యాజమాన్యం



**జయభేరి, పరవాడ :**

జీవిఎంసీ 79 వ వార్డు పరిధిలో గల వైన్ షాపులలో కల్తీ మద్యంతో బెల్ట్ షాపులు వెలిసి దాని ద్వారా కష్టపడి కూలీ నాలి చేసుకుని వస్తున్న పేదవారు ఈ కల్తీ మద్యానికి బానిసై ఆసుపత్రిలో జాయిన్ అవుతున్నారు.జీవీఎంసీ 79 వార్డు పరిధిలో గల లంకెలపాలెం దేశపత్రినిపాలెంలో గల వైన్ షాపుల్లో కల్తీ మద్యానికి అడ్డగా తయారైందని పలువురు గుసగుసలు ఆడుకొంటున్నారు ఇదంతా ఒకటైతే లంకెలపాలెం, పెదముసిడివాడ ,కన్నూరు, సాలాపువానిపాలెం, ఈ. బోనంగి తదితర గ్రామాల్లో మద్యం షాపులు పుట్టగొడుగుల్లాగా వెలిశాయి.ఈ బెల్టు షాపులకు లంకెలపాలెం, దేశపాత్రునిపాలెంలో గల షాపుల నుండి విచ్చలవిడిగా మద్యం సరఫరా జరుగుతుందని బెల్టు షాపులు నియంత్రినే ముఖ్య ఉద్దేశంగా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతుంటే దానికి భిన్నంగా లంకెలపాలెం, దేశ పాత్రునిపాలెంలో గల వైన్ షాపులు యాజమాన్యం ఈ దందా నడుపుతున్నాయి.ఇక్కడ ఇంత తతంగం జరుగుతున్న ఎక్సేంజ్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకి నీరుతున్నట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.79 వ వార్డు కెరీఫ్ గా నడుస్తున్న ఈ అక్రమ మద్యానికి మరియు బెల్టు షాపులుకు మద్యం సరఫరాను నియంత్రించాలని లంకెలపాలెం ప్రజలు కోరుతున్నారు అధికారులు స్పందించి బెల్ట్ షాపులు నియంత్రించకపోతే కలెక్టర్ కు మరియు సీఎం పేస్ కు లిఖితపూర్వకంగా కంప్లీట్ చేస్తాము అని లంకెలపాలెం ప్రజలు హెచ్చరించారు.

## గణనాధుని కృప ప్రజలందరికీ ఉండాలి

- అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 01 :**

షాద్ నగర్ పట్టణంలోని శివ పార్వతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాతుని పూజ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంను ప్రారంభించారు.

ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ; హిందూ సాంప్రదాయంలో గణనాధునికి ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ఏ కార్యక్రమం ప్రారంభించిన మొదటగా ఆ గణనాధుని పూజా కార్యక్రమం చేసిన తర్వాత ఇతర కార్యక్రమాలు చేస్తారని అన్నారు. గణనాథుని కృప ప్రజలందరికీ ఉండాలని అష్ట ఐశ్వర్యాలతో అందరూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అన్నదానం మహాదానం అన్నదానం అనేది ఒకరి ఆకలి తీర్చేదని, పదిమంది ఆకలి తీరుస్తే మహా పుణ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్,శ్యామ్ సుందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు శివ, బాలాజీ, దుర్గేష్, అరుణ్ కుమార్, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

## దేవునిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం

- బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన ప్రజలు



**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 01 :**

ప్రజలు ఒక చోట నుంచి మరొక చోటుకు ప్రయాణించడానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శంకర్ సోమవారం షాద్ నగర్ నుండి దేవునిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం ప్రారంభించారు. ప్రతి ఊరికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తానని ఎన్నోసార్లు అధికారులతో సమావేశమై ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే విధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర అడుగులు వేస్తున్నారు. ఇంతకుముందు కరోనా సమయంలో దేవునిపల్లి గ్రామానికి అధికారులు బస్సు సౌకర్యం నిలిపివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వారందరూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు సమస్య విన్నవించడంతో వెంటనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులను సంప్రదించి దేవునిపల్లి గ్రామానికి బస్సును తిరిగి ప్రారంభింపజేశారు. ఈ బస్సు షాద్ నగర్ నుండి బయలుదేరి శ్రీరంగాపూర్, చిన్న ఎల్కిచర్ల, పుల్లప్ప గూడ, అయోధ్యపూర్ తాండ తదితర గ్రామాల గుండా దేవునిపల్లికి చేరుకుంటుందని, ప్రతిరోజు ఉదయం సాయంత్రం రెండుసార్లు బస్సు సౌకర్యం ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు . బస్సు సౌకర్యం తిరిగి ప్రారంభం కావడం పట్ల విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, మంగులాల్ నాయక్ పురుషోత్తం రెడ్డి, శివ, సాయిలు, నర్సింలు, అరుణ్ కుమార్, శ్రీకాంత్, సునీల్, నరసింహ, జాంగిర్, బసప్ప, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిల్లు ఆమోదం కోసం

- గవర్నర్ తో అఖిల పక్ష నేతల భేటీ

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 1:**



బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంపునకు సంబంధించిన బిల్లులు శాసనసభలో ఆమోదం పొందాయని, వాటిని ఆమోదించాలని పలువురు నేతలు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. సోమవారం ఉదయం పీసీసీ చీఫ్, మంత్రులు, అఖిలపక్ష నేతలు రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిశారు. స్థానిక సంస్థల్లో ఉన్న 50 శాతం రిజర్వేషన్ నిబంధన ఎత్తివేస్తూ బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచుతూ శాసన సభలో ప్రవేశపెట్టిన పురపాలక, పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని, మూడ్ ఆఫ్ హౌజ్ పరిగణనలోకి తీసుకొని బిల్లులను ఆమోదించాలని గవర్నర్ ను కోరారు.తెలంగాణ గవర్నర్‌ను కలిసిన వారిలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, కెపి వివేకానంద గౌడ(బీఆర్ఎస్), సీపీఐ నేతలు నారాయణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఉన్నారు. అంతకుముందు సోమవారం ఉదయం తెలంగాణ శాసనమండలిలో పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను ఆమోదించారు. ఓవైపు సభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులపై చర్చ జరుగుతుంటే, మరోవైపై కాళేశ్వరం కమిషన్ నివేదికపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు.

తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కేసు ఇప్పుడు సీబీఐ కోర్టులో ఉందని.. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల పాత్రపై ఆయన చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన కాళేశ్వరం అవినీతి అంశం ప్రస్తుతం సిబిఐ కోర్టు పరిధిలో ఉంది. ఈ విచారణ కొనసాగుతున్న క్రమంలో అన్ని పార్టీలు న్యాయ ప్రక్రియను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.

**బీజేపీకి నిజాయితీని నిరూపించుకునే అవకాశం**

గతంలో కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్‌కు, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెందిన అవినీతి ఏటీఎంగా బీజేపీ పేర్కొనడాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు బీజేపీకి తమ మాటలకు అర్థం చెప్పే అవకాశం ఉందన్నారు. బీజేపీ కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తోందని గుర్తు చేస్తూ, ఇప్పుడు వారే దర్యాప్తు వేగవంతం చేయాలని కేంద్రానికి ఒత్తిడి చేయాలని మహేష్ గౌడ్ సూచించారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపరమైన బిల్లులకు బీఆర్ఎస్ కూడా బీజేపీ మాదిరిగానే అడ్డు పడుతుండటాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. పీసీ ఘోష్ నివేదిక కాళేశ్వరం అవినీతిపై స్పష్టత ఇచ్చిందని, దీనితో బీఆర్ఎస్ నేతల పాత్ర బహిరంగమైందని అన్నారు.

సీబీఐకి ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రులు స్వయంగా బాధ్యత తీసుకోవాలి. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సీబీఐ దర్యాప్తును ఆమోదించారని తెలిపారు. అందువల్ల ఇప్పుడు వారు ఆ దర్యాప్తును వేగవంతం చేయడానికి చొరవ చూపాలని మహేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవినీతికి బీఆర్ఎస్ నాయకత్వం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని పీసీ ఘోష్ నివేదిక ద్వారా స్పష్టమయ్యిందని పేర్కొన్నారు.

**సీబీఐకి ఇవ్వడానికి కారణం**

ప్రతిపక్షాలు సిట్ లేదా సీఐడీ దర్యాప్తుపై విమర్శలు చేస్తాయని అంచనా వేసి, తెలంగాణ ప్రభుత్వం పారదర్శకత కోసం సీబీఐకి విచారణ అప్పగించినదని మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. ప్రజల సంక్షేమం కోసం పారదర్శక పాలన అందిస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అడ్డు కడుతూ బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు మరియు కేటీఆర్ అసత్యాలను ప్రచారం చేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నారని మహేష్ గౌడ్ విమర్శించారు. మద్దతిస్తూనే పార్లమెంటులో వెనకడుగు వేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు తీసుకొచ్చిన బీసీ బిల్లులకు తెలంగాణ అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పార్లమెంటులో మాత్రం దాని అనుకూలంగా నిలవడం లేదు. ఇది వారి దౌర్భాగ్య రాజకీయం అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చరిత్రాత్మకం

- మేడ్చల్ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ సమావేశం.. గజ్జెల కాంతం

**జయభేరి, మేడ్చల్ :**



బీసీలకు 42శాతం రిజర్వేషన్లు బిల్లు అమలు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయం అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు, పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి అధ్వర్యంలో కార్యాలయం ముందు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సాహసోపేతమైన ఎస్సీ వర్గీకరణ, బిసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దక్కుతుందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏ వర్గాన్ని పట్టించుకోకుండా కుటుంబంలో పదవులు తీసుకున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో అవినీతి బయట పడడం ఖాయమని కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు లు తీహార్ జైలుకు వెళ్లడం ఖాయమని ఏద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ బీసీ అంటూ బీసీలకు చేసింది ఏమీ లేదనీ గజ్జెల కాంతం దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు ముందంజలో ఉండాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు గెలుపొందడానికి సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్, శశికళ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొండమల్లెపల్లి చౌరస్తాలో బిఆర్ఎస్ ధర్నా

- కాలేశ్వరం ప్రాజెక్టు పై దర్యాప్తును సిబిఐకి అప్పగించడానికి నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో ఆందోళన
- ధర్నాలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రామవత్ రవీంద్ర కుమార్
- రవీంద్ర కుమార్ ను అదుపులోకి తీసుకొని దేవరకొండ స్టేషన్ కు తరలించిన పోలీసులు

**జయభేరి, కొండమల్లేపల్లి :**



కాలేశ్వరం ప్రాజెక్టు పై దర్యాప్తును సిబిఐకి అప్పగించడానికి నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జిలు ధరించి ఆందోళనకు దిగారు. రాస్తారోకో చేపట్టారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు వచ్చిందని, కాలేశ్వరం ప్రాజెక్టుపై అభండాలు సృష్టించి రాజకీయాలను పక్కదోపట్టించే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. రాత్రికి రాత్రి సిబిఐ కి కాలేశ్వరం ప్రాజెక్టు పై దర్యాప్తును అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ జాతిపితగా కెసిఆర్ పై ప్రజల్లో ప్రేమ నమ్మకం అలాగే ఉందని రాబోయే రోజుల్లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కొండమల్లేపల్లి పోలీసులు రవీంద్ర కుమార్ ను అదుపులోకి తీసుకొని దేవరకొండ పోలీస్ స్టేషన్ కు తరలించారు ఈ కార్యక్రమంలో BRS నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి బొప్పా బొరియ..



**జయభేరి, మేడిపల్లి :**

మల్లయ్య నగర్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా చిన్నారుల భరత నాట్య ప్రదర్శన. అన్న ప్రసాద కార్యక్రమం. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోట కూర అజయ్ కుమార్, మాజీ వార్డు సభ్యులు తోట కూర రవీందర్ హాజరయ్యారు. వారిని కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో కాలనీ కుటుంబ సభ్యులు, చుట్టూ ఉన్న కాలనీల కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. చిన్నారుల ఆట పాటలతో మల్లయ్య నగర్ గణేష్ మండపం భక్తి గీతాలతో.. ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఇందులో పాల్గొన్న అతిథులకు ఇన్ని ప్రోగ్రాంలు నిర్వహించటానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## చంద్రబాబుకు ప్రశంసల జల్లు

**జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 1:**

చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్లయింది. ఈ నేపథ్యంలో ఆయనకు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా సీఎం చంద్రబాబును ఉద్దేశించి ప్రత్యేక సందేశం విడుదల చేశారు. చంద్రబాబు దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి అని, తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయం అని కొనియాడారు. "భవిష్యత్తును ఊహించి ప్రణాళికబద్ధంగా దూరదృష్టితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దార్శనికుడు చంద్రబాబు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పాలనా దక్షతతో ఆయన చేపట్టిన కార్యక్రమాలు, సంస్కరణలు అభివృద్ధిని పరుగులు పెట్టించాయి. పాలనలో ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా సవాళ్లుగా స్వీకరించి ముందడుగు వేశారు. హైదరాబాద్ మాదాపూర్ ప్రాంతంలో కొండలు, గుట్టలుగా ఉన్న ప్రాంతాన్ని ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. 90వ దశకంలో ఆయన ఐటీ రంగానికి పెద్దపీట వేయడం వల్లే తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల నుంచి ఐటీ ఉద్యోగులు వచ్చారు. రైతు బజార్ల ఏర్పాటు, డ్వాక్రా సంఘాల స్థాపన, పేదల కోసం వెలుగు ప్రాజెక్టు ప్రారంభం, మీసేవా కేంద్రాల ఏర్పాటు వంటి నూతన ఆవిష్కరణలు చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనం. రాష్ట్ర విభజన అనంతరం క్లిష్ట సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు. ప్రజా రాజధానిగా అమరావతి, రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు, వీటితోపాటు పారిశ్రామికవృద్ధి లక్ష్యంగా 2014లో పాలన మొదలుపెట్టారు. 2024లోనూ మరింత క్లిష్ట పరిస్థితుల్లో పాలనా పగ్గాలు చేపట్టారు. కఠిన సవాళ్లు ముందున్నా దృఢచిత్తంతో పాలన వ్యవస్థను ముందుకు తీసుకెళుతున్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అభివృద్ధి పనులు, వివిధ ప్రాజెక్టులకు నిధులు సాధించడం చంద్రబాబు నాయకత్వ లక్షణాలను తెలియజేస్తుంది. పాలనా వ్యవహారాల్లో టెక్నాలజీ వినియోగిస్తూ, ప్రజలకు సత్వర సేవలు అందేలా చేస్తున్నారు. దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి నిర్దేశకత్వంలో మా మంత్రివర్గం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తోంది" అని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## తిప్పర్తిలో యూరియా కష్టాలు

**జయభేరి, నల్లగొండ:**

తిప్పర్తి మండల కేంద్రంలోని ఎస్డీసిఎంఎస్ వద్ద యూరియా కోసం రైతులు భారీగా వచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఆధార్ కార్డు జిరాక్సు, పాస్బుక్ జిరాక్సులు, రాళ్లు క్యూ లైన్ లో పెట్టారున రైతులు. ఎస్డీసిఎంఎస్ తిప్పర్తి కేంద్రానికి 200 బస్సుల యూరియా వస్తే.. దాదాపు 400 మంది రైతులు క్యూ లైన్లలో ఉన్నారు. రైతుల తాకిడి ఎక్కువ అవడంతో యూరియా ఇవ్వలేక షాపు యాజమానులు చేతులెత్తేసారు. వ్యవసాయ అధికారులు పత్తాలేకుండా పోయారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 4 వ వార్డ్ కిష్టాపూర్ గ్రామంలోని వీకర్ సెక్షన్ కాలనీ, అర్చన కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ త్రిసభ్య కమిటీ సభ్యులు రెడ్డెం గారి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి లు మాట్లాడుతూ మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ లో గల వీకర్ సెక్షన్, అర్చన కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వ్యవస్థ సీసీ రోడ్ల నిర్మాణం లేకపోవడంతో నిర్మాణ పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూడూరు సొసైటీ మాజీ డైరెక్టర్ వేముల సత్యనారాయణ రెడ్డి, స్థానిక నాయకులు తొంట యాదయ్య, వేముల నాగిరెడ్డి, అర్చన కాలనీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, టైలర్ రాజు, వేముల రంజిత్ రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఓరియంటేషన్ డే




**జయభేరి, దేవరకొండ :**

మునగల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (A) దేవరకొండలో ప్రథమ సంవత్సర విద్యార్థిని విద్యార్థులకు ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.రమావత్ రవి మాట్లాడుతూ కళాశాలలో ఉన్న అన్ని సదుపాయాల గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ముఖ్యంగా NCC,NSS లైబ్రరీ(14000 పుస్తకాలు ఎన్ లిస్ట్ ద్వారా ఒక లక్ష నుండి రెండు లక్షల దాకా పుస్తకాలు ఆన్లైన్ లైబ్రరీలో అందుబాటులో కలవని, ఫిజికల్ ఎడ్యుకేషన్ ,TSKC ల్యాబ్ ,ELL ల్యాబ్ లో ఉన్న 150కి పైగా కంప్యూటర్లు సౌకర్యం గురించి, RO ద్వారా సేఫ్ డ్రింకింగ్ వాటర్ అలాగే విద్యార్థుల ఆటల సదుపాయం కోసం 15 ఎకరాల ప్లే గ్రౌండ్, అధునాతనమైన సైన్స్ ల్యాబ్లు అలాగే ఉత్తమ అర్హతలు కలిగిన 19 మంది అధ్యాపకులు 8 మంది అధ్యాపకేతరులు కలరని పేర్కొన్నారు. తర్వాత అకాడమీ కోఆర్డినేటర్ సి. లింగమయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్నల్ మరియు థియరీ పరీక్షలు, క్వశ్చన్ పేపర్ మోడల్ తదితర విషయాలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి లింగమయ్య, IQAC కోఆర్డినేటర్ డాక్టర్ కె పృథు, COE జి.లింగారెడ్డి, అన్ని డిపార్ట్మెంట్ ల HOD లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## పల్లె పహాడ్ కుమ్మర సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 01:**

తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామ కుమ్మర సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా జాగిల్లపురం రాజయ్య, యూత్ అధ్యక్షునిగా జాగిళ్ళపురం బాల కృష్ణ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవరుప్పల ఐలయ్య ,ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, కోశాధికారి జాగిల్లపురం సత్యనారాయణ, ఆలేరు కన్వీనర్లు జివిలికపల్లి ఆంజనేయులు, దేవరుప్పల మల్లేష్, ప్రచార కార్యదర్శి కొండల్, గ్రామస్తులు ఇంద్రపాలకృష్ణ, జాగిలాపురం సత్తయ్య ,శ్రీనివాస్, రాములు ,మహేష్ ,భాస్కర్ ,వినయ్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎన్నిక




**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 01:**

తుర్కపల్లి మండల పంచాయతీ కార్యదర్శిల యూనియన్ ఎన్నికను సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యదర్శుల మండల అధ్యక్షునిగా మారగోని సాయి కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అల్తాఫ్, ఉపాధ్యక్షురాలు పరిష శైలజ, కిష్టపాటి సందీప్ రెడ్డి, కోశాధికారిగా దన్సీరామ్ కొండయ్య ,గౌరవ అధ్యక్షులుగా బొల్లారం నరసింహ, సంయుక్త కార్యదర్శి ముకర్ల వెంకటేష్, అజ్మీర సురేష్, సలహాదారులుగా కొమ్మిరి శెట్టి బాలరాజు, కూరెల్ల నాగరాజు లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన యూనియన్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీ ఓ దంతూరి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా మెడికల్.. వ్యాపారం



**జయభేరి, నిజామాబాద్, సెప్టెంబర్ 1:**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మెడికల్ వ్యాపారం మేత మేస్తుంది. పల్లె పట్టణాల్లో యదేచ్ఛగా విస్తరిస్తూ నిరుపేదలను నిండా ముంచుతుంది. నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకుంటూ అర్హత లేని సిబ్బందితో ఫార్మసీలను నడుపుతూ ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నారు. వారు చెప్పిందే వేధంగా నిరుపేదలను నమ్మబల్కుతూ వేళల్లో డబ్బులు దండుకుంటున్నారు.నిర్వాహకులు వీరిని చనువుగా చేసుకొని భారీ ఆఫర్లు ఇవ్వడం జరుగుతుంది ఇటు నిరుపేదల నుండి కార్పొరేట్ ఆసుపత్రుల నుండి కమిషన్లు దండుకుంటూ వీరికి పనిగా మారింది ఇదంతా జరుగుతున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉన్న వైద్యశాఖ తనిఖీ అధికారులు తమకేమీ పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారు. డ్రగ్ ఇన్స్పెక్టర్లు ప్రతిపక్షం రోజులకు ఒకసారి మెడికల్ షాపులను తనిఖీ చేస్తూ ఎక్స్పైరీ డేట్ ఉన్న మందులను కనుక్కోవడమే కాకుండా వారు నిర్వహిస్తున్న మెడికల్ షాపుల విషయంలో సూక్ష్మంగా పరిశీలించాల్సి ఉంటుంది ఇదేమి పట్టనట్టుగా మెడికల్ షాపు నిర్వాహకులు అందజేసే మామూళ్లకు అలవాటయ్యారు.పలు ప్రైవేట్ ఆస్పత్రి యజమానాలు ధనార్జన దేంగా పెట్టుకుని ఆర్ఎంపి పిఎంపిలను తమ చేతుల్లో ఉంచుకుంటున్నారు. చిన్న పెద్ద ఆస్పత్రుల్లోని తేడా లేకుండా ముందే ధరలను నిర్ణయించుకుని అవసరం లేని పరీక్షలను రాస్తూ ఇటు డాక్టర్లు అటు ఆర్ఎంపి పిఎంపీలు రోగుల బాధితులను నుండి పెద్ద మొత్తంలో దండుకునే పరిస్థితి నెలకొంటుంది. ఆస్పత్రి లో మెడికల్ షాపుల బిల్లు కట్టాలంటే మెడలో ఉన్న బంగారు ఆభరణాలను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది రోజురోజుకు శుద్ధిమిరూస్తున్న వీరీ వ్యాపారం కాస్త నిరుపేదలకు శాపంగా మారుతుంది.నిజాంబాద్ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పల్లెలు పట్టణాల్లో ఇష్ట రాజ్యాంగ మెడికల్ షాపులు వెలుస్తున్నాయి. ఫార్మాసి చేసిన వారే మెడికల్ షాపులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఫార్మాసిస్టులు లేకుండానే ఎవరు పడితే వారి మెడికల్ షాపులో నిర్వహిస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు అంతేకా కుండా రిసెప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ నేరుగానే మందులు విక్రయిస్తున్నారు పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇంత జరుగుతున్న డ్రగ్ ఇన్స్పెక్టర్లు మాత్రం తనిఖీలు చేసిన పాపాన పోలేదు ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏ మందు లు ఇవ్వాలన్న ఏ మందులు వాడాలన్న ఆర్ఎంపి పిఎం పిలదే ఇష్ట రాజ్యాంగ మారింది పల్లెల్లో పట్టణాల్లో ఎక్కడ చూసినా ఆర్ఎంపీ పి ఏం పిలు చెప్పిన మందులే మెడికల్ షాప్ నిర్వాహకులు ప్రజలకు ఇస్తూ దండుకుంటున్నారు అంతేకాకుండా తక్కువ ధర మందులను కూడా ఎక్కువ ధరకు విక్రయించాలంటూ మెడికల్ షాప్ నిర్వాహకులకు ఆర్ఎంపి పి.ఎం. పి వైద్యులు తెలపడంతో ఎక్కువ ధరలకు విక్రయిస్తూ వచ్చిన కమిషన్ ఆర్ఎంపీ పి.ఎం.పి లకు అందజేస్తూ ధనార్జన దేంగా పనిచేస్తున్నారు ఇప్పటికైనా మెడికల్ షాప్ నిర్వాహకులు పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని నిబంధనలను పాటిస్తూ మందులు విక్రయించాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు వైద్యులు ఆర్ఎంపి పిఎంపీలను గాలం వేసి వారి గుప్పిట్లో ఉంచుతున్నారు పేద ప్రజలను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఆసుపత్రిలోకి చేర్పిస్తూ కమిషన్ దందా మీద పనిచేసేలా ప్రవేట్ ఆసుపత్రి కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు దందాను కొనసాగిస్తున్నారు . అంతేకాకుండా ప్రైవేట్ ఆసుపత్రిలో రాసిన మందులను ఆసుపత్రిలోని మెడికల్ లోని కొనుగోలు చేసేలా నిబంధనలు పెడుతూ ధనార్జన ధ్యేయంగా మందులను విక్రయిస్తూ పేద ప్రజల పోట్టగొడుతున్నారని పలువురు మండి పడుతున్నారు. అంతేగాకుండా ఆర్ఎంపీపీ ఎంపీలతో ఒక్కొక్క రోగిని ఆసుపత్రిలో చేర్పిస్తే కమిషన్ దందా మీద ప్రతిరోజు వందల సంఖ్యలో ఆసుపత్రులకు పంపిస్తూ దండుకుంటున్నారు ఎప్పటికైనా వీరిపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు వెలుస్తున్న పట్టినట్టు వ్యవహరిస్తున్నారు జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు అధికారులు పల్లెల్లో పట్టణాల్లో ఎక్కడ చూసినా ఫార్మసిస్టులు లేకుండా విశిష్టను లేకుండా మందులు విక్రయిస్తూ దండుకుంటున్నారు దీంతో జిల్లాలోని అన్ని మెడికల్ షాప్ నిర్వాహకులు మామూలు మత్తులిస్తూ అధికారులు తనిఖీలు చేయకుండా ప్రత్యేక ప్యాకేజీలతో ముడుపులు అందజేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు మాత్రం నిద్రమత్తులో జరుగుతున్నారని పలువురు పేర్కొంటున్నారు ఇప్పటికైనా మామూల మత్తును వదిలి ఉమ్మడి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మెడికల్ షాప్ లపై దాడులు చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

---

## ఏడు పాయల అమ్మవారి ఆలయం ఎదుట మంజీరా నది ఉధృతి

**జయభేరి, మెదక్:**

ఏడుపాలయ అమ్మవారి అలయం గత 19 రోజులుగా జలదిగ్బంధంలోనే వుంది. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగుతున్నాయి. సింగూరు ప్రాజెక్టు 7 గేట్లు ఎత్తడంతో ఆలయం ఎదుట ప్రమాదకర స్థాయిలో మంజీరా నది ప్రవహిస్తోంది. అమ్మవారి గర్భగుడిలోకి ప్రవేశించి ఆలయంపై కప్పుని తాకి పరవళ్లు తొక్కుతోంది.

---

## ఎల్బీ నగర్ లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

**జయభేరి, ఎల్బీనగర్:**

ప్రధాని నరేంద్రమోడి తల్లి గురించి బీహార్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ చేసిన అవమాన కరమైన వాక్యాలను తీవ్రంగా కండిస్తు ఎల్బీనగర్ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జ్ సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి ప్రజాస్వామ్యం మీద రాజ్యాంగం మీద నమ్మకం లేదని అన్నారు.. వచ్చే 30 సంవత్సరాల కాలం పాటు బిజెపి పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంటుందని అనేక సర్వేలు చెప్తున్నాయి అని అన్నారు. నరేంద్ర మోడీని ప్రపంచ దేశాలు సైతం నరేంద్ర మోడీ పాలనను మెచ్చుకుంటున్నాయని తెలిపారు.. నరేంద్ర మోడీకి ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూడలేక నరేంద్ర మోడీ కుటుంబం పై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు.. ఖబర్దార్ కాంగ్రెస్ పార్టీ నాయాకులంటూ హెచ్చరించారు.. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పుతారన్నారు..

---

## భూ వివాదంలో ఇరువు వర్గాల మధ్య ఒకరిపై ఒకరూ గొడ్డలతో దాడి

- ఒకరు మృతి, మరో ముగ్గురికి గాయాలు

**జయభేరి, రంగారెడ్డి**

ఇబ్రహీంపట్నం మండలం దండు మైలారం పరిధిలో ఓ భూ వివాదంలో గొడ్డలితో దాడి చేసుకున్న ఇరువర్గాలు. గుడ్డేటి బాలరాజ్ (36) అనే వ్యక్తి పై దాడి జరగడంతో తీవ్ర గాయలతో జరుగగా ఇబ్రహీంపట్నంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు, ఈ దాడి మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి, పరిస్థితి విషమంగా ఉంది, వీరంతా దండుమైలారం గ్రామానికి చెందిన ఒక్కే కుటుంబానికి చెందిన వారే. ఇరువర్గాల మధ్యన ఘర్షణలో గాయపడ్డ వాళ్ళు, మంజుల, ప్రమీల, పావని మరొక వ్యక్తికి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తుంది. మృతుడి సోదరుడు ఈ విషయంపై గతంలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుని ప్రమేయంతోనే ఈ ఘటన జరిగిందని తీవ్రస్థాయిలో ఆరోపణ. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుండి మృతదేహాన్ని సొంత గ్రామం దండు మైలారం తరలించే క్రమంలో మృతుడి బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

---

## గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ నిధులు రికవరీ చేయించండి

- హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ కు ఐజేయూ వినతిపత్రం
- నిధుల దుర్వినియోగం చేసిన పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ శ్రీధర్ రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్

**జయభేరి, హన్మకొండ, సెప్టెంబర్ 1 :**



నిధుల దుర్వినియోగానికి పాల్పడి కేసులు ఎదుర్కొంటు న్న పూర్వ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ శ్రీధర్ రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లులపై చట్టపరమైన చర్యలు తీసుకుని నిధుల రికవరీ చేసి అట్టి నిధులు క్లబ్ కు జమ చేయించాలని TUWJ (IJU), ప్రెస్ క్లబ్ బాధ్యులు కలెక్ట రను కోరారు. ఈ మేరకు హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కు వినతిపత్రం అందించారు. TUWJ (IJU) అధ్యక్షకార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెండెం వేణుమాధవ్, కంకణాల సంతోష్, రాష్ట్ర హౌసింగ్ & వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ వల్లాల వెంకటర మణ, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు. బొల్లారం సదయ్య, మాజీ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, కృష్ణకుమార్ రెడ్డి, నాగరాజు, బండారి ప్రమోద్, సర్వేశ్వ ర్. రాకేష్, రవి, తదితరులు కలెక్టరేట్ లో కలెక్టర్ స్నేహ శబరీష్ను కలసి ఫిర్యాదు చేశారు.

"క్లబ్ నిధులను దుర్వినియోగం చేసిన తుమ్మ శ్రీధర్ రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లుతో సామరస్య పూర్వ కంగా పలుమార్లు సమావేశాలను అన్ని యూనియన్లబాధ్యులు, క్లబ్ బాధ్యులతో కలసి ఉమ్మడిగా నిర్వహిం చినా వారు పెడ చెవిన పెట్టడంతో వారిపై చట్టపరమైన చర్యలకు ఆ సమావేశం సిఫార్సు చేసిందని, ఆ నిర్ణయాలను వారు ధిక్కరించటంతో విధిలేని పరిస్థితుల్లో సుబేదారి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయటం జరిగిందని వివరించారు. అట్టి ఫిర్యాదుపై సుబేదారి పీఎస్లో ఎఫ్ ఆర్ నెంబర్ 206/2024 కేసు నమోదైందని తెలిపారు. ఆ కేసు విషయంలో చొరవ తీసుకుని వారి నుండి నిధుల రికవరీ అయ్యేలా చూసి క్లబ్ కు జమచేయించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ నాటికి క్లబ్ లో జరుగుతున్న అన్ని అభి వృద్ధి పనులు పూర్తిచేసేందు కు నిర్ణయించామని కలెక్టర్. కు వివరిం చారు. తక్షణమే నిధులు రికవరీ చేయించాలని కోరారు. ఈ వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిం చారు.

---

## ఘనంగా గణేష్నవరాత్రి ఉత్సవాలు

- మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం

**జయభేరి, మేడిపల్లి, సెప్టెంబర్ 01 :**

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని చెంగిచెర్ల గణేష్ నగర్ కాలనీ శ్రీ శ్రీ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి 6వ రోజు గణపతికి ఘనంగా పూజలు నిర్వహించి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కొత్త రవి గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్త రవి గౌడ్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు కులాలు, మతాలకు అతీతంగా నిర్వహించుకోవడం జరుగుతుందని ఆ గణపతి దయవల్ల కార్పొరేషన్ ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండేటట్టు వినాయకుడ దీవించాలని కోరడమైనది ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





---



## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీఠం

**జయభేరి, ఉప్పల్ :**

మల్లాపూర్ డివిజన్ పరిధిలో మౌలిక కల్పనకు పెద్దపీట చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మణ్ రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాబా నగర్ కాలనీ, 9.5 లక్షల రూపాయలతో గ్రీన్ హిల్స్ కాలనీలో 13 లక్షల రూపాయలతో భూగర్భ డ్రైనేజి అభివృద్ధి పనుల శంకుస్థాపన పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల తో కలిసి దేవేందర్ రెడ్డితో కలసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి లైన్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దశల వారీగా డివిజన్ ను అబివృద్ధి చేస్తాం మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

---

## జోనల్ కమిషనర్ నీ కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



**జయభేరి, ఉప్పల్ :**

జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాలనీలల్లో సీసీ రోడ్లు, కొరకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు.

---

## వినాయక మండపాల సందర్శన

- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తుంగతుర్తి రవి



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్వి ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుంగతుర్తి రవి. మండపాల్లో భక్తులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. వినాయకుడి ఆశీస్సులతో పీర్జాదిగూడ అభివృద్ధి మరింత వేగంగా సాగాలి. ప్రజలతో కలిసి పనిచేస్తేనే సమాజం ముందుకెళ్తుంది. యువత సమాజ సేవలో, అభివృద్ధి మార్గంలో ముందుండాలి. పర్యావరణాన్ని కాపాడుతూ, పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి," అని అన్నారు.అలాగే మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, శుభ్రత పై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల వాసులు, యువకులు, సంఘ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

---

## రవాణా శాఖ మంత్రిని కలిసిన తెలంగాణ డ్రైవింగ్ స్కూల్ జేఏసీ సభ్యులు

- రవాణా శాఖలో సారధి పోర్టల్ సమస్యలపై వినతి పత్రం అందజేత



**జయభేరి, మేడిపల్లి :**

రవాణా శాఖలో కొత్తగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహన, సారథి పోర్టల్ లో తలెత్తుతున్నటువంటి సమస్యలను, ప్రభుత్వాన్నికి జరిగినష్టాన్ని,వాహన చోదకులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ జేఏసీ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ వాహన సారథి పోర్టల్ ఎదుర్కొన్న సమస్యను తక్షణమే నివృత్తి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై నిరంతరం తెలుసుకుంటూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సామ శ్రీకాంత్ రెడ్డి, ట్రెజరర్ కొండ కింది సురేందర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ బాలరాజు, వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# హ్యాట్రిక్ హిట్ కోసం..

వెండితెరపై హిట్ పెయిర్‌గా పేరు తెచ్చుకున్నారు అగ్ర తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'గీత గోవిందం' 'డియర్ కామ్రేడ్' చిత్రాలు మంచి విజయాల్ని సాధించాయి. మరోవైపు ఈ జంట ప్రేమలో ఉన్నారని గత కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ జంట మూడోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం సోమవారం సెట్స్‌మీదకు వెళ్లింది. ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా షెడ్యూల్‌లో విజయ్‌రష్మిక పాల్గొంటున్నారు. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత వారిద్దరు కలిసి నటిస్తుండటం విశేషం. రాయలసీమ నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# కొత్త సినిమా ప్రకటన రాబోతుందా?



సెప్టెంబర్ 2 పవన్ కళ్యాణ్ బర్త్ డే కాగా, ఈ రోజుని పవన్ కళ్యాణ్ అభిమానులు ప్రత్యేకంగా మార్చనున్నారు. సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్ యాష్ ట్యాగ్‌ని ట్రెండ్ చేస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు మేకర్స్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌కి అదిరిపోయే ట్రీట్స్ అందించే ప్లాన్ చేశారు.. పవన్ రాజకీయాల్లో బిజీగా ఉన్నా చేతిలో ఉన్న సినిమాలు పూర్తిచేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవలే హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ కాగా, ఇది మిక్స్‌డ్ టాక్ దక్కించుకుంది. ఇక సెప్టెంబర్ 25న OG రిలీజ్ కాబోతుంది. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. పవన్ బర్త్ డే సందర్భంగా ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి పవన్ కళ్యాణ్ కొత్త పోస్టర్ రిలీజ్ చేయగా, ఇది ఫ్యాన్స్‌కి పూనకాలు తెప్పించింది. ఈ పోస్టర్‌తో మూవీపై అంచనాలు భారీగానే పెరిగాయి. మరోవైపు ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న OG సినిమా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ అయితే లేదు. పవన్ పుట్టిన రోజు నాడు ట్రైలర్ రిలీజ్ చేస్తారేమో అని రూమర్ వచ్చింది కానీ అందులో నిజం లేదు. తాజా సమాచారం ప్రకారం OG నుంచి ఓ గ్లింప్స్ తో పాటు ఓ కొత్త పోస్టర్ రిలీజ్ చేస్తారని తెలుస్తుంది. ఇక ఈ సినిమాని సెప్టెంబర్ 25న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. పవన్ చేస్తున్న సినిమాలే ఆయనకి లాస్ట్ అని అంతా భావిస్తున్నారు. అయితే పవన్ కి సంపాదన కేవలం సినిమాలే కాబట్టి ఇంకా సినిమాలు చేస్తారని టాక్. గతంలో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో SRT ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో ఓ సినిమా ప్రకటించారు. నిర్మాత పవన్ డేట్స్ ఇస్తే ఆ సినిమా చేస్తాం అని తెలిపారు. దీంతో పవన్ పుట్టిన రోజు సందర్భంగా ఆ సినిమాకి సంబంధించి ఏదైన అప్‌డేట్ ఇస్తారేమో చూడాలి.



# బ్యూటిఫుల్ లుక్‌లో శ్రద్ధా దాస్..

శ్రద్ధా దాస్, అల్లరి నరేష్ సిద్ధూ ఫ్రం శ్రీకాకుళం సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీతో ఈ బ్యూటీ మంచి గుర్తింపు సంపాదించుకుంది. తన అందం,నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. దీంతో తర్వాత వరసగా సినిమాల్లో అవకాశాలు అందుకుంది. తర్వాత ఈ చిన్నది అల్లు అర్జున్, కాజల్ హీరో, హీరోయిన్లుగా చేసిన డార్లింగ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసింది. ఈ మూవీలో ఈ అమ్మడు అందానికి, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. తన అంద చందాలతో యూత్ ఫేవరెట్ అయిపోయింది ఈ ముద్దుగుమ్మ. తర్వాత మరో చరిత్ర, పీ ఎస్ వి గరుడ వేగా, ఎక్ మినీ కథ , అంటూ పలు సినిమాల్లో మెరిసింది. ఇన్ని సినిమాల్లో నటించినప్పటికీ ఈ బ్యూటీకి అదృష్టం కలిసి రాలేదనే చెప్పాలి. ఈ బ్యూటీ ఎప్పుడూ సెకండ్ హీరోయిన్‌గా నే చేసింది తప్ప, స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా మాత్రం అవకాశాలు అందుకోలేకపోయింది. ఇక తర్వాత మెల్లిగా అవకాశాలు తగ్గడంతో తెలుగు చిత్ర పరిశ్రమకు దూరమైంది.



# అందాలు ఘుమ్మ.. తిళ్లా ఘుమ్మ..

నేహా శెట్టి.. టాలీవుడ్ ఇండస్ట్రీలో రాధికగా ఫుల్ ఫేమస్ అయ్యింది. డీజే టిల్లు సినిమాతో ఒక్కసారిగా ఇండస్ట్రీలో సెన్సేషన్ బ్యూటీగా మారిపోయింది. అప్పటివరకు ఆమె నటించిన సినిమాలేవి అంతగా ఆకట్టుకోలేకపోయాయి. కానీ సిద్ధు జొన్నలగడ్డ జోడిగా డీజే టిల్లు సినిమాతో టాక్ ఆఫ్ టౌన్ గా మారిపోయింది. డీజే టిల్లు సినిమాలో గ్లామర్ ఫోజులతో రచ్చ చేసింది. ఆ తర్వాత గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి చిత్రంలో నటించింది. అలాగే టిల్లు స్క్వేర్ సినిమాలో చిన్న పాత్రలో నటించింది. ఇక ఇప్పుడు సినిమాల్లో సైలెంట్ అయిన ఈ అమ్మడు.. ఇప్పుడు సోషల్ మీడియాలో వరుస ఫోటోషూట్స్ చేస్తుంది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ అభిమానులతో చిట్ చాట్ చేస్తుంది. తన గురించి ఎన్నో ఆసక్తికర విషయాలు పంచుకుంటుంది. అయితే కొద్ది రోజుల నుంచి నెట్టింట ఈ బ్యూటీ సైలెంట్ అయ్యింది. చాలా రోజులుగా ఎలాంటి ఫోటో షేర్ చేయడం లేదు. తాజాగా ఈ అమ్మడు మాల్దీవ్స్ వెకేషన్ కు వెళ్లగా.. అక్కడ ఫోటోస్ అభిమానులతో పంచుకుంది. రాత్రిపూట గ్లామర్ ఫోజులతో నెట్టింట గత్తరలేపుతుంది. తాజాగా మాల్దీవ్స్ రిసార్ట్ లో దిగిన ఎన్నో ఫోటోలను పంచుకుంది. అలాగే మిడ్ నైట్ వాక్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది.

# అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల కూతురు





జాన్వీ కపూర్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. చూడ చక్కని అందం, ఆకట్టుకునే అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. అయితే ఈ అమ్మడికి ఇప్పటి వరకు ఒక్క పెద్ద హిట్ కూడా రాలేదు. సినిమాల కన్నా గ్లామర్ షోతోనే జాన్వీ ఎక్కువగా వార్తలలో నిలుస్తూ ఉంటుంది. టాలీవుడ్‌కి దేవర చిత్రంతో ఎంట్రీ ఇవ్వగా, ఇప్పుడు రామ్ చరణ్‌తో పెద్ది అనే మూవీ చేస్తుంది. ఈ సినిమాపై చాలా ఆశలే పెట్టుకుంది జాన్వీ కపూర్. మరోవైపు తన తల్లి నటించిన చిత్రాన్ని జాన్వీ కపూర్ రీమేక్ చేయనుందట. ఇప్పుడు ఈ వార్త నెట్టింట వైరల్‌గా మారింది.

నాలుగు దశాబ్దాల క్రితం శ్రీదేవి హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ చిత్రం 'చాల్‌బాజ్'. 1989లో విడుదలై సంచలన విజయం సాధించిన ఈ చిత్రం శ్రీదేవికి కెరీర్‌లో మైలురాయి అయ్యింది. పంకజ్ పరాశర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో శ్రీదేవి ద్విపాత్రాభినయం చేయగా, ఆమెతో పాటు రజనీకాంత్, సన్నీ డియోల్ కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, యాక్షన్, ఎమోషన్స్ అన్నీ కలగలసిన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు అందుకుంది. ఈ సినిమా రీమేక్ పై పనులు మొదలైనట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తుంది. ఇందులో శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ ప్రధాన పాత్రలో నటించనున్నారని సోషల్ మీడియాలో కథనాలు ఊపందుకున్నాయి. ఈ ప్రాజెక్టు ఫైనల్ స్టేజ్‌లో ఉండగా, అధికారిక ప్రకటన ఈ నెలాఖరులో వెలువడే అవకాశం ఉందని సమాచారం. తల్లి నటించిన చిత్రాల్లో తనకు 'ఛాల్‌బాజ్' మూవీనే ఇష్టమని పలు ఇంటర్వ్యూలలో చెప్పిన జాన్వీ, ఇప్పుడు అదే సినిమాలో నటించే అవకాశం రావడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని సన్నిహితులు చెబుతున్నారు. అయితే, ఈ రీమేక్ కథలో మార్పులు చేస్తారా? మౌలికంగా అదే ఫార్మాట్ కొనసాగుతుందా? దర్శకుడు ఎవరు? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. పాత తరానికి జ్ఞాపకాలని అందిస్తూ , కొత్త తరానికి నూతన అనుభూతి ఇచ్చేలా ఈ రీమేక్ ఉంటుందని అంచనాలు మొదలయ్యాయి. ఈ వార్తలపై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com